క్లుప్తంగా

నేడు ఫాసిజంపై రాష్ట్ర సదస్సు

ముషీరాబాద్: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాయల సుభాష్‌చంద్రబోస్ 7వ వర్ధంతి సందర్భంగా భారతదేశం-ఫాసిస్టు ప్రమాదం అనే అంశంపై మార్చి 10వ తేదీ (నేడు) ఉదయం 10 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్మారకోపన్యాసాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాలపై వీక్షణం సంపాదకులు ఎస్.వేణుగోపాల్, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, అఖిల భారత విద్యా హక్కుల వేదిక నాయకులు రమేష్ పట్నాయక్, సామాజిక విశ్లేషకులు దేవి, రచయిత, సంపాదకులు సతీష్‌చందర్, సామాజిక విశ్లేషకులు భార్గవ మాట్లాడుతారన్నారు.

శుభాకాంక్షలు

ముషీరాబాద్: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారైన ప్రముఖ కవి, రచయిత దేశపతి శ్రీనివాస్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహ ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తా

ప్రొఫెసర్ నతానీయేల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ నతానీయేల్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో బంధు సొసైటీ హైదరాబాద్ అధ్యక్షులు పల్లెల వీరస్వామి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నతానీయేల్ మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కూడా మండలిలో టీచర్ల సమస్యలను ప్రస్తావించకుండా నిర్లక్ష్యం చేశారని విద్యా రంగానికి యేటా బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించడంతో విద్యా రంగ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడడం లేదని రాష్ట్రంలోని అనేక పాఠశాలలకు బోధనేతర సిబ్బంది కూడా లేరన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారన్నారు. తనకు గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పెళ్లి కావడం లేదని యువతి ఆత్మహత్య

కాచిగూడ: వివాహం కావడం లేదని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ రవికుమార్ వివరాల ప్రకారం.. బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన గోరిబీ (27) తనకు పెళ్లి కావడం లేదని మనస్తాపం పడుతూ ఉండేది. గురువారం సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫంక్షన్ హాల్ టెండర్ల అడ్డగింత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఉద్యోగుల కోసం నిర్మించిన నాన్ టీచింగ్ హోం ఫంక్షన్ హాల్ టెండర్లను ఉద్యోగులు అడ్డుకున్నారు. ఫంక్షన్ హాల్‌ను బయటి వ్యక్తులకు ఇవ్వాలని ఓయూ ఎస్టేట్ అధికారులు చేసిన ప్రయత్నాలను ఉద్యోగ సంఘాల నేతలు అభ్యంతరం తెలిపారు. ఓయూకు సంబంధించిన వ్యక్తులకే ఫంక్షన్ హాల్ లీజుకు ఇవ్వాలని, బయటి వ్యక్తులకు ఇస్తే రూ.20 వేల అద్దెకు ఉద్యోగుల కుటుంబాల శుభ కార్యాలయాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓయూ వీసీ జోక్యం చేసుకొని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

లహరికి ఉగాది జాతీయ పురస్కారం

అబిడ్స్: ఐఎస్.ఓ గుర్తింపు పొందిన జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక భాషా సంస్థ కర్ణాటక తెలుగు రచయిత్రల సమాఖ్య ఉగాది జాతీయ పురస్కారం 2023కు కవయిత్రి ఎస్. లహరి ఎంపికయ్యారు. కొన్ని సంవత్సరాలుగా ఎన్నో కవితలను రాయడంలో ఆమె ప్రతిభను గుర్తించి ఉగాది జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సమాఖ్య చైర్మన్ డాక్టర్ మాల్యాది బొగ్గవరపు ప్రకటించారు. కవయిత్రి లహరి మార్చి 19న బెంగళూర్‌లో జరిగే జాతీయ పురస్కారాల కార్యక్రమంలో ఉగాది జాతీయ పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా లహరి మట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో తాను చేస్తున్న కృషికి, ప్రతిబింబించే కవితా సంపుటి అక్షర నేత్రాలకి ప్రత్యేక పురస్కారం లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఘనంగా రథోత్సవం

రామంతాపూర్: సత్యదేవుని ఆలయ 50వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 8 గంటల నుంచి నిర్వహించిన రథోత్సవంలో శ్రీరమాదేవి సమేత సత్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. పలు వీధుల్లో రథోత్సవం జోరుగా సాగింది. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కోట్ల నర్సింహారెడ్డి, ఈవో సత్యచంద్రరెడ్డి, ప్రధాన అర్చకులు విజయసారథి, తిరుపతాచార్యులు, శేషాచార్యులు, సీతారామచార్యులు, అన్నమనేని జగదీష్, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది మురళీధర్‌రావు, శంకర్, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గరం.. పనుల్లో వేగం

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో 3 నెలలు ట్రాఫిక్ మళ్లింపు

- మంత్రి కేటీఆర్ ఆగ్రహంతో స్టీల్ బ్రిడ్జి పనుల్లో వేగం
- ఎల్ఐసీ బ్రిడ్జి నుంచి గాంధీనగర్ మీదుగా గొల్కొండ చౌరస్తాకు..
- కసరత్తులు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు



అధికారులతో కలిసి రాంనగర్‌లో స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్(ఫైల్)

ముషీరాబాద్: స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంపై ఇటీవల మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2వ తేదీ వరకు పనులు పూర్తి కావాలని లక్ష్యాన్ని నిర్దేశించడంతో జీహెచ్ఎంసీ ప్రాజెక్టు అధికారులు నిర్మాణ పనులను వేగవంతం చేశారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న అశోక్‌నగర్ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు పనులను పూర్తిచేసేందుకు మార్చి 10వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు మూడు నెలల పాటు వాహన రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్‌ను మళ్లించారు.

మళ్లింపు ఇలా..

- నారాయణగూడ బ్రిడ్జి చిక్కడపల్లి మీదుగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు వచ్చే వాహనాలు సుధా హోటల్ గల్లీ నుంచి డైవర్ట్ చేసుకుని త్యాగరాగానసభ, సిటీ సెంటర్ లైబ్రరీ మీదుగా అశోక్‌నగర్ చౌరస్తాకు వచ్చి ఆ నుంచి నేరుగా ఇందిరాపార్కు వైపు వెళ్లాల్సి ఉంటుంది.
- ఆంధ్ర మహిళా సభ వీఎస్‌టీ మీదుగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు వచ్చే వాహనాలు రూట్ మార్చుకుని హెబ్‌రోన్ చర్చి, ఆంధ్రా కేఫ్, జగదాంబ హాస్పిటల్ వరకు వచ్చి అక్కడ నుంచి ఎడమ చేతి వైపు తిరిగి అశోకనగర్ చేరుకోవాలి.
- ఇందిరాపార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు వచ్చే వాహనాలు అశోక్‌నగర్ చౌరస్తా వద్ద ఎడమ వైపు తీసుకుని జగదాంబ హాస్పిటల్, ఆంధ్రా కేఫ్, గోల్కొండ క్రాస్ రోడ్ మీదుగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌కు చేరుకోవచ్చు.
- ఇందిరాపార్కు నుంచి చిక్కడపల్లికి వెళ్లే వాహనాలు అశోక్‌నగర్‌చౌరస్తాలో రైట్ టర్న్ తీసుకోని స్ట్రీట్ నెంబర్-9 మీదుగా సిటీ సెంటర్ లైబ్రరీ, సుధా హోటల్ నుంచి చిక్కడపల్లి చేరుకోవాలి.
- కవాడిగూడ సీజీవో టవర్స్ మీదుగా అశోక్‌నగర్, క్రాస్‌రోడ్స్ మీదుగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు వెళ్లే వాహనాలు ఆర్‌సీరెడ్డి కోచింగ్ సెంటర్ నుంచి జగదాంబ ఆసుపత్రి, ఆంధ్ర కేఫ్, హెబ్రోన్ చర్చిమీదుగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు చేరుకోవాలి.
- హిమాయత్‌నగర్ నుంచి అశోక్‌నగర్ ఎక్స్ రోడ్స్ మీదుగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు చేరుకునే వాహనాలు సిటీ సెంటర్ లైబ్రరీ, త్యాగరాయ గాన సభ, సుధా హోటల్ లైన్ నుంచి చిక్కడపల్లి మెయిన్ రోడ్స్‌కు చేరుకోవాలి. మూడు నెలల పాటు ఈ ట్రాఫిక్ మళ్లింపు కొనసాగుతుందని వాహనదారులు సహకరించాలని ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం చెప్పల్ బజార్‌లో రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న తాగునీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక బస్తీల్లో అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పాదయాత్రలో స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బస్తీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామన్నారు. బస్తీల అభివృద్ధిలో బస్తీవాసులు భాగస్వామ్యం కావాలన్నారు. ఎటువంటి చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలో 80 శాతం పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర భీష్మదేవ్, శిరీష ఓంప్రకాష్ యాదవ్, సునీల్ బిడ్లాన్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బి.కృష్ణాగౌడ్, దేవిరెడ్డి విజితారెడ్డి, కన్నె రమేష్ యాదవ్, సుభాష్ పటేల్, బీంరాజ్, రవియాదవ్ పాల్గొన్నారు.

కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌తో సమావేశం..

అంబర్‌పేట: సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం బాగ్ అంబర్‌పేట సీఈ కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌తో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశమై అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పీడ్ బ్రేకర్లు, పోలీస్ పెట్రోలింగ్, డ్రైనేజీ, కోతులు, వీధికుక్కలు వంటి సమస్యలను ఎమ్మెల్యేతో ప్రస్తావించారు. సీఈ కాలనీలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఆదేశించారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

మానవ శరీరంలో కిడ్నీల పాత్ర కీలకం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాచిగూడ: ప్రపంచ కిడ్నీ, నో స్మోకింగ్ దినోత్సవం సందర్భంగా గురువారం కాచిగూడలోని టీఎక్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించేందుకు వాకథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఎట్ట పాల్గొని మాట్లాడారు. కిడ్నీలు మనిషి శరీరంలోని వ్యర్థాలు, రక్తంలోని అధికంగా ఉన్న ఫ్లూయిడ్స్‌ని శుభ్రపర్చి బయటకు పంపించడంలో కీలకంగా పనిచేస్తాయన్నారు. మనిషి రక్త పోటుని క్రమబద్ధీకరించి ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేసి, ఎముకలను పటిష్ట పర్చడంలో సహాయ పడుతాయన్నారు. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఎక్కువగా నీళ్లు తాగడం, సోడియం శాతం తక్కువ ఉన్న ఆహారం తీసుకోవడం, ప్రాసెస్ట్ ఫుడ్ తగ్గించడం, వ్యాయామం, స్మోకింగ్, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హిదయుతుల్లా, శ్రీకాంత్, శ్రీకీర్తి, నరేష్ దూడె, నరేష్ కుమార్ గజ్జెల పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

కవాడిగూడ: కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సీనియర్ యూరాలజీస్టు డాక్టర్ కె.శ్రీనివాస్ సూచించారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం ముషీరాబాద్ కేర్ ఆసుపత్రిలో కిడ్నీ పేషంట్ కనెక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కె.శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. మూత్రపిండాల వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే నిరోధించవచ్చన్నారు. షుగర్, అధిక రక్తపోటును అదుపులో ఉంచుకుంటే కిడ్నీ వ్యాధుల బారిన పడరన్నారు. అనంతరం కేర్ ఆసుపత్రిలో చికిత్స పొంది మెరుగుపడిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేర్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ నఫీ, సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్టు డాక్టర్ గుల్లా సూర్యప్రకాష్, వైద్య సిబ్బంది రాజేందర్, సతీష్‌బాబు పాల్గొన్నారు.

కుమావత్ సమాజ్ సంక్షేమానికి కృషి

అబిడ్స్: కుమావత్ సమాజ్ సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని కుమావత్ సమాజ్ ట్రస్ట్ హైదరాబాద్ అధ్యక్షుడు బాకార్ రామ్ కుమావత్ పేర్కొన్నారు. తమ ట్రస్టు నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. ట్రస్టు ఆధ్వర్యంలో హోలీ మిలన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల ప్రముఖులకు ఘనంగా సత్కారం చేశారు. రామ్‌దేవ్ బాబా మందిర్ చైర్మన్ శ్యామ్ సుందర్ గిల్డా, సంఘ సేవకుడు విపిన్ సింగ్, విజయ్ దినేష్ సింగ్, జీవన్ సింగ్‌తో పాటు పలువురికి సత్కారం చేశారు. ఈ సందర్భంగా బాకార్ రామ్ కుమావత్ మట్లాడుతూ.. తమ కుమావత్ సమాజ్ ఆధ్వర్యంలో హిందూ సాంప్రదాయాలను, సంస్కృతిని చాటే విధంగా అన్ని పండుగలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమల్ కిశోర్ కర్వా, లక్ష్మణ్‌లాల్ బదీవల్, సోహల్‌లాల్ మోటావత్, దీపారామ్ దుబాలాడియా, విజయ్, రవి, పవన్ పాల్గొన్నారు.

లో ప్రెషర్ సమస్యకు పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: నరేంద్ర పార్క్ లేన్, కళావతి లేన్‌లో కొద్ది రోజులుగా తాగునీరు లో ప్రెషర్‌తో వస్తుంది. సమస్యను స్థానికులు కార్పొరేటర్ అమృత దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కార్పొరేటర్ గురువారం జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి లో ప్రెషర్ సమస్య ఉన్న ప్రాంతంలో పర్యటించారు. పైపుల్లో బ్లాక్‌లు ఏర్పడిన ప్రాంతాన్ని గుర్తించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని ఏ బస్తీలో కూడా నీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

బీసీలకు రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇవ్వాలి

కాచిగూడ: బీఆర్ఎస్ ప్రకటించిన ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులు అగ్రకుల సామాజిక వర్గానికి చెందిన వారేనని, గవర్నర్ కోటాలోనైనా రెండు ఎమ్మెల్సీ స్థానాలు బీసీలకు ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపెల్లి అంజి డిమాండ్ చేశారు.

ఏపీలో అక్కడి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 18 ఎమ్మెల్సీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 14 పదవులు ఇచ్చి రాజకీయ అవకాశం కల్పిస్తే తెలంగాణలో సీఎం కేసీఆర్ మాత్రం అగ్రకులాల వారికి అగ్రతాంబూలం ఇస్తూ బీసీలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికైనా గవర్నర్ కోటాలో ప్రకటించే 2 ఎమ్మెల్సీ సీట్లను బీసీలకు ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

రైల్లో బంగారు ఆభరణాల బ్యాగు చోరీ

కాచిగూడ: రైలు ప్రయాణికురాలి బంగారు, వెండి వస్తువుల బ్యాగు చోరీకి గురైన సంఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిగూడకు చెందిన కవిత రాజ్‌పుత్ ఈ నెల 8న అహ్మదాబాద్ నుంచి రైల్‌లో నగరానికి వస్తుండగా నాందేడ్ వద్ద 35 గ్రాముల బంగారు ఆభరణాలు, వెంటి వస్తువులు, రెండు సెల్ ఫోన్లు ఉన్న బ్యాగు చోరీకి గురైంది. గురువారం బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశామన్నారు.

'టీడీపీ హయాంలోనే నగరాభివృద్ధి'

చిక్కడపల్లి: టీడీపీ పాలనలో నగరం అన్ని విధాల అభివృద్ధి చెందిందని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. గురువారం డివిజన్ అధ్యక్షుడు బి.రాజు ఆధ్వర్యంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని చేపట్టారు. అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజ్ గౌడ్, శక్తి ప్రేమ్, భవాని శ్రీనివాస్, చంద్రమోహన్ గౌడ్, యాదగిరి, సత్యనారాయణ పాల్గొన్నార.

'ప్రైవేట్'లలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలి



నిరసనలో పాల్గొన్న బ్రహ్మచారి చైతన్య, తదితరులు

కవాడిగూడ: విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా సీట్లు కేటాయించాలని డెమోక్రటిక్ సంఘాల ప్రతినిధి బ్రహ్మచారి చైతన్య డిమాండ్ చేశారు. ఈ నిబంధనలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ గురువారం ఇందిరాపార్కు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మచారి చైతన్య మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యను అందించడం ద్వారానే సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు సాధించుకోవచ్చని అన్నారు. గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇవ్వాలనే నిబంధనలు ఉన్నా ఏ పాఠశాల యాజమాన్యం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టాన్ని వెంటనే అమలు చేసి నిరుపేద విద్యార్థులను సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఇందుకోసం రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిరసనలో శేఖర్, భాస్కర్, ఈశ్వర్‌రావు, రాము పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదు'

ఉప్పల్: ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాలను ప్రచారం చేస్తూ గురువారం మేడ్చల్- మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు కందిఅశోక్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నేటికీ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలే తప్ప, కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే వరకు కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు తిక్క ప్రకాశ్, నాయకులు పబ్బతి శేఖర్‌రెడ్డి, ప్రతిభ, మేరీ, ప్రభావతి, ఈనాశమ్మ, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈద్గా షెడ్ నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం

ఉప్పల్: చిలుకానగర్ బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో చిలుకానగర్ డివిజన్ ప్రాంతానికి చెందిన ముస్లింలు ఘనంగా సన్మానించారు. డివిజన్ పరిధిలో మైనార్టీ ఖబరస్థాన్‌లో రూ.39 లక్షలతో ఏర్పాటు చేసిన ఈద్గా షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈద్గా ఫ్లోరింగ్ పెండింగ్ పనులకు అదనంగా నిధులు మంజూరు చేయాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన ఆమె పనులు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అబ్బుబాయ్, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, ఎదుల కొండల్‌రెడ్డి, హనీఫ్, జలీల్ పాషా, ఫొటో బాలు, శ్యామ్ ఉన్నారు.

మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

నల్లకుంట: మహిళలు తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని నాబార్డ్ సీజీఎం సుశీల చింతల అన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ(డీడీఎంఎస్) సెంట్రల్ ఆఫీస్ క్యాంప్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం డీడీహెచ్ ఆడిటోరియంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా డీడీఎంఎస్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలను విజయవంతంగా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. మహిళలు పురుషులతో సమానంగా కష్టపడుతున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు ఎస్. ఉషారెడ్డి, డాక్టర్ జీఎల్‌కె. దుర్గా, లక్ష్మీ సుందరి, సీతారాంబాబు, రాణి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ ఫిజియో థెరపీ(డీడీసీవోపీ) ప్రిన్సిపల్ ఛాయా నందిని పాల్గొన్నారు.

నారాయణగూడ కళాశాలలో..

కాచిగూడ: మహిళల చేసే త్యాగం వెలకట్టలేనిదని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం కోఠి ఉమెన్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ బి.శైలజ అన్నారు. గురువారం నారాయణగూడలోని కళాశాలలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళలు దేశ అధ్యక్షులు, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, జడ్జిలు, సైంటిస్టులుగా రాణిస్తున్నారన్నారు. సమాజంలో మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, సునితా రెడ్డి, సూర్యప్రకాష్, శంభు ప్రసాద్, గీతారామన్ పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం : సౌత్ ఇండియా అడ్వకేట్స్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా దినోత్సవం నిర్వహించి పలువురు మహిళలను సత్కరించారు. అనంతరం సౌత్ ఇండియా అడ్వకేట్స్ జేఏసీ అధ్యక్షులు ఎస్.నాగేందర్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ప్రగతిని సాధిస్తున్నారని ప్రభుత్వాలు, రాజ్యాంగం కల్పించిన అవకాశాలు సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు ఇందిరా, వనిత, పుష్ప, వీరయ్య పాల్గొన్నారు.

చీరల పంపిణీ..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. క్లబ్ అధ్యక్షులు నలిపెల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మారుతున్న ఆధునికత, సాంకేతిక విజ్ఞానం నేపథ్యంలో మహిళలను ప్రోత్సహిస్తే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి పి.నిరంజన్‌రెడ్డి, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ సంతోష్‌గౌడ్, కోశాధికారి సునీల్, హౌస్‌హెడ్ డైరెక్టర్ ఎ.కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళ లేనిదే మనుగడ లేదు..

ముషీరాబాద్: మహంకాళీ, సికింద్రాబాద్ జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షులు లక్ష్మిపద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్యామ్ సుందర్‌గౌడ్ పాల్గొని మహిళల పాత్ర, వారి ప్రాధాన్యత గురించి వివరించారు. మహిళలు లేనిదే మనుగడ లేదని లక్ష్మిపద్మజ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సరళ, కె.దీపిక, సుప్రీయ, పావనీ, రచనశ్రీ పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న పద్మజ

ముషీరాబాద్: రాంనగర్ ప్రధాన రహదారిలోని ప్రార్థన వీరులచర్చిలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో డాక్టర్ ఎం.మేర్లీన ముఖ్య అతిథిగా హాజరై కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.జమునా, ఎం.శారా, క్రిస్టినా, అనురాధా, వరలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

పురస్కారం ప్రదానం..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలో సావిత్రిబాయి పూలే సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య విద్య సేవా రంగాలలో విశేష సేవలకు ప్రముఖ కవి, రచయిత, ఉపాధ్యాయురాలు గాజుల మధులతకు మహిళా శిరోమణి జాతీయ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూరపల్లి నందా, సంస్థ చైర్మన్ మీనుగా గోపి, తెలంగాణ లాయర్స్ ఫోరం అధ్యక్షులు నాగుల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఎం.మేర్లీన



మాట్లాడుతున్న సుశీల చింతల



అవార్డు అందుకుంటున్న మధులత